క్లుప్తంగా

పల్లెల్లో వెల్లివిరిసిన పండగ వాతావరణం



కాకరాపల్లిలో శ్రీరాముని చిత్రపటంతో ఊరేగింపు

మునగపాక : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం అయోధ్య రామాలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాకరాపల్లిలో శ్రీరాముని చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల కోలాటం అందరినీ ఆకట్టుకుంది. అలాగే మునగపాకలో ఇంటింటికీ అయోధ్య అక్షింతలను వలంటీర్ల సహకారంతో అందజేశారు. దీంతో పల్లెల్లో పండగ వాతావరణం వెల్లివిరిసింది.

వాడ్రాపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం



వాడ్రాపల్లిలో కంటి పరీక్షలు చేస్తున్న నేత్ర వైద్యాధికారి హరి చందన

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, సత్యసాయి వెల్డింగ్ బ్యాచ్ సంయుక్త నిర్వహణలో జరిగిన ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ప్రారంభించారు. శిబిరంలో నేత్ర వైద్యాధికారి హరిచందన వైద్య సేవలందించారు. 83 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో 18 మందికి శస్త్ర చికిత్సలు అవసరంగా గుర్తించారు. వారిని విశాఖలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఫౌండేషన్ క్యాంపు డిప్యూటీ మేనేజర్ ఎం.అరుణ్‌కుమార్, క్యాంపు కో–ఆర్డినేటర్ ప్రసాద్, నర్సింగ్ స్టాఫ్ సంధ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తమ్మిర్సిని పరామర్శించిన చిక్కాల



తమ్మిర్సిని పరామర్శిస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట : మండలంలో గల సత్యవరం గ్రామ ఎంపీటీసీ తమ్మిర్సి సత్యనారాయణను జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు పరామర్శించారు. ఎంపీటీసీ సత్యనారాయణకు ఇటీవల బైక్ యాక్సిడెంట్‌లో కాలికి గాయం కావడంతో ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్నారు. చిక్కాల రామారావుతో పాటు గ్రామ మాజీ సర్పంచ్ తమ్మిర్సి గంగారావు, గూటూరు వెంకటేశ్వరరావు, పాలపర్తి సతీష్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

లెనిన్ సేవలు ఎనలేనివి



రాంబిల్లిలో లెనిన్ చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

రాంబిల్లి : ప్రపంచంలోనే మొట్టమొదటి కార్మిక రాజ్యాన్ని స్థాపించి లెనిన్ కార్మికులకు ఎన్నో సేవలందించారని సీపీఎం మండల కార్యదర్శి జి. దేముడునాయుడు అన్నారు. లెనిన్ మరణించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాంబిల్లిలో సీపీఎం నాయకులు లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్మికులకు 8 గంటల పని విధానాన్ని ఆయనే అమల్లోకి తీసుకువచ్చారని దేముడునాయుడు తెలిపారు. నాయకులు నారాయణరావు, శివాజీ, రాంబాబు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత నర్సీపట్నం

నర్సీపట్నం: పట్టణంలో నర్సీపట్నం క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మండలంలోని ఆరు జట్లు పాల్గొన్నాయి. నర్సీపట్నానికి చెందిన మనోజ్ జట్టు విజేతగా, కులదీప్ జట్టు రన్నరప్‌గా నిలిచాయి.

శరవేగంగా కులగణన

మండలంలో 25 గ్రామ సచివాలయాల పరిధిలో వేగంగా కులగణన జరుగుతోంది. సాంకేతిక సమస్యలను అధిగమించి ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

- లక్ష్యం పూర్తి చేసేందుకు శరవేగంగా సర్వే
- ఉద్యోగులకు సహకరిస్తున్న ప్రజలు



గ్రామాల్లో కులగణన సర్వే నిర్వహిస్తున్న వలంటీర్లు



కొరుప్రోలులో సర్వే నిర్వహిస్తున్న సచివాలయ కార్యదర్శి రామలక్ష్మి

పాయకరావుపేట : మండలంలో గల ఆయా గ్రామాల్లో కులగణన సర్వే చురుగ్గా నిర్వహిస్తున్నట్లు ఈవోఆర్‌డీ సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలో గల 25 గ్రామ సచివాలయాల పరిధిలోను గ్రామ వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి కులాల వారీగా సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరా

కొరుప్రోలులో..

ఎస్.రాయవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే ఆదివారం కూడా మండలంలో సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు శరవేగంగా చేశారు. సర్వర్ హెచ్చు తగ్గులు ఉంటున్నప్పటికీ పట్టు విడవకుండా అనుకున్న టార్గెట్ పూర్తి చేయడంలో సిబ్బంది చొరవ చూపారు. ప్రభుత్వం ఏ పని అప్పగించినా కృత నిశ్చయంతో చేస్తామని సచివాలయ సిబ్బంది, వలంటీర్లు చెప్పారు. సర్వే వివరాలు తెలిపేందుకు ఆయా గ్రామస్తులు ఆసక్తి కనబరిచారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు రామలక్ష్మి, ప్రసాద్, రమేష్‌బాబు, సత్యనారాయణ, వీఆర్వోలు శ్రీధర్, గోపి, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు ఉత్సవం



పెదదొడ్డిగల్లులో ఉర్సు ఉత్సవం సందర్భంగా నమాజ్ చేస్తున్న దృశ్యం

నక్కపల్లి: మండలంలో ఆదివారం ముస్లిం గ్రామాల్లో హజరత్ క్వాజా గరీబ్ నవాజ్ రహ్మతుల్లా అలైహి చందనోత్సవం (ఉరుసు) అత్యంత ఘనంగా జరిగింది. ఉదయం ఐదు గంటలకు పెద దొడ్డిగల్లులో ఫజర్ నమాజ్ అనంతరం ఖురాన్ ఖానీ, మధ్యాహ్నం జోహార్ నమాజ్ తర్వాత రెండు గంటల నుంచి క్వాజా బాబావారి సందల్, చందనోత్సవ ఊరేగింపు జరిగాయి. డంకా పార్టీ వారిచే పెద దొడ్డిగల్లు గ్రామంలో ఉన్న క్వాజా గరీబ్, నవాజ్ వారి నిషాని నుంచి పెద్ద సంఖ్యలో భక్తులతో పరిసర ఏడు ముస్లిం గ్రామాలైన రామకృష్ణాపురం, పెద బొదిగల్లం, సీతారామపురం, అప్పలపాయకరావుపేట, చెల్లాపురం, చిన బొదిగల్లం గ్రామాల్లో ర్యాలీ జరిగింది. సాయంత్రం మగీరద్ సమాజ్ అనంతరం కాకినాడ మదర్సాకు చెందిన మౌలానా మొహమ్మద్ రిజ్వీ ఆధ్వర్యంలో క్వాజా గరీబ్ నవాజ్, ఇస్లాం ముఖ్య విషయాలపై తెలుగు ఆధ్యాత్మిక ప్రసంగం జరిగింది. అనంతరం సలతూ సలాం, ఫాతెహా, తబురుఖ్, ఆమ్ దావత్ జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు హైదర్ అలీ సింకా, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కేబీ బాబా, ఏడు ముస్లిం గ్రామాల పెద్దలు సర్ ఖజీ మకబుల్ అహమ్మద్ ఇమాం ఖ్వాజా, సలామి, మహబూబ్ సుబాని, సింకా కాలేషా, ఆలీఫరూక్, రంజాన్ ఆలీ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవరచుకోవాలి

- విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్
- రామాలయ నిర్మాణానికి రూ.25 లక్షల విరాళం ప్రకటన



విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌ను సత్కరిస్తున్న మునగపాక గ్రామ పెద్దలు

మునగపాక : ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవరచుకోవాలని విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో గురువారం మునగపాక గ్రామ పెద్దలతో నూతనంగా నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర రామాలయ నిర్మాణానికి సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తన వంతుగా రూ. 25లక్షల విరాళం ప్రకటించారు. గ్రామ పెద్దలు ఆనంద్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఇటువంటి కార్యక్రమాన్ని తలపెట్టిన మునగపాక గ్రామస్తులను ఆయన అభినందించారు. ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి విరాళాలు అందజేయాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ కోరారు. భగవంతుని ఆశీస్సులు అందరిపైనా ఉండాలన్నారు. ఎంపీటీసీ సూరిశెట్టి రాము అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, డాక్టర్ బద్దెం సూర్యనారాయణ, కాళ్ల జగ్గారావు, దాడి మునిలినాయుడు, టెక్కలి పరశురామ్, పెంటకోట వెంకటరావు, మొల్లేటి సత్యనారాయణ, మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



వాడ్రాపల్లిలో పూర్వ విద్యార్థుల సందడి



మునగపాక హైస్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మునగపాక : మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో 1992–93లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఒకచోట చేరి ఉత్సాహంగా గడిపారు. వెలగా రామకృష్ణ, వేగి కృష్ణ, దాడి కృష్ణ, కాండ్రేగుల జగన్, పూసర్ల సత్యనారాయణ తదితరులు ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. అలాగే మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో 1990–91లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు వాడ్రాపల్లి ఆవ ప్రాంతంలో ఆత్మీయంగా సమావేశమయ్యారు. సహపంక్తి భోజనాలు చేసి ఉత్సాహంగా గడిపారు.

కొండకర్ల ఆవలో..

అచ్యుతాపురం : అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం ఉన్నత పాఠశాలలో 1993–94లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు కొండకర్ల ఆవ వద్ద సందడి చేశారు. ఆదివారం ఒకే చోట చేరుకుని చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. 150 మంది విద్యార్థులు ఈ కలయికలో పాల్గొన్నారు. కాండ్రేగుల భాస్కర్‌రావు, శరగడం మోహన్‌రావు, పేలూరి నాయుడు, అంగులూరి శ్రీను, గణేష్, కోటి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీకార్డుల పంపిణీ



అర్హులకు ఆరోగ్య శ్రీ కార్డులు అందిస్తున్న గ్రామ కార్యదర్శి చంద్రశేఖర్

పాయకరావుపేట : మండలంలో గల ఆయా గ్రామాల్లో ఆరోగ్య శ్రీ కార్డులు అర్హులందరికీ పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో ఎ.సాంబశివరావు తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ హెల్త్ కార్డు ద్వారా రూ. 25 లక్షల వరకు వైద్య ఖర్చులు వర్తింపు జరుగుతుందని తెలిపారు. 2 వేల రోగాలకు ఆరోగ్య శ్రీ ద్వారా పేదలు ఉచిత సేవలు పొందవచ్చన్నారు. కొత్తగా విడుదలైన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ హెల్త్ కార్డులను ఆయా గ్రామాల్లో గ్రామ వలంటీర్లు అర్హులందరికీ చురుగ్గా అందిస్తున్నారు.

ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించాలి



వికసిత భారత్ కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీవో

ఎస్.రాయవరం: ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు ఎంతమేర ఉపయోగపడుతున్నదీ వికసిత భారత్ కార్యక్రమంలో అధికారులు తెలుసుకోవాలని నర్సీపట్నం ఆర్డీవో జయరాం అన్నారు. వమ్మవరం గ్రామంలో ఆదివారం నిర్వహించిన వికసిత భారత్ కార్యక్రమానికి ఆర్డీవో హాజరయ్యారు. అధికారులు వివిధ శాఖల నుంచి ఏర్పాటు చేసిన ప్రదర్శనలను పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి లబ్ధి పొందుతున్న ప్రభుత్వ పథకాలు ఎంత మేర ప్రయోజనం చేకూర్చాయి, వాటిని లబ్ధిదారులకు ఎలా ఉపయోగించుకుంటున్నారన్న విషయాన్ని వారి అభిప్రాయాల్లో తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో రామచంద్రమూర్తి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, తహసీల్దార్ విజయ్ కుమార్, సర్పంచ్ పాలపర్తి పాపారావు, ఏపీఎం శివప్రసాద్, ఎంఈవో మూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొంతిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు తగిన గుర్తింపు

నక్కపల్లి : తెలుగు దేశం పార్టీలోనే బీసీలకు తగిన గుర్తింపు లభించిందని, మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే మరింత గుర్తింపు ఇచ్చి రాజకీయ పదవుల్లో ప్రాధాన్యత ఇస్తామని పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే వంగల పూడి అనిత అన్నారు. ఆదివారం దేవవరంలో బీసీ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీలు టీడీపీకి వెన్నుముక లాంటి వారన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పెద్ద పీట వేసి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలుగా తగిన ప్రాధాన్యత ఇచ్చారన్నారు. బీసీలంతా మళ్లీ టీడీపీని గెలిపించి చంద్రబాబును సీఎం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ కురందాసు నూకరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, కాశీనాయుడు, వైబోయిన రమణ, సూర్యగణేష్, తాతారావు, కె. బుజ్జి, వి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల తీర్థమహోత్సవం

ఆకట్టుకున్న కోలాటం

రాంబిల్లి : పెదకలవలాపల్లి గ్రామంలో ఆదివారం సీతారాముల తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సీతారాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనలు, కోలాటాలు, తప్పెటగుళ్లతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యలమంచిలి కనకారావు, మాజీ సర్పంచ్ పుణ్యమంతుల తాతబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు అందె ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా అపరాల సాగు



కట్టుబోలు సమీపంలో పెసర పైరు

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో సాగు చేస్తున్న పెసర, మినుము (అపరాలు) పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. వాతావరణం అనుకూలంగా ఉండటంతో పెసర, మినుము మొక్కలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ఖరీఫ్ వరికోతల అనంతరం రైతులు అపరాలు సాగు చేస్తున్నారు. మండలంలో పలు గ్రామాల పరిధిలో సుమారు 2600 ఎకరాల్లో రైతులు ఈ పంట వేశారు. పొగ మంచు ప్రభావం లేకుండా ఉంటే అపరాల సాగు లాభదాయకంగా వుంటుందని రైతులు పేర్కొన్నారు. ఈ పంట సాగు విధానంలో సలహాలు, సూచనలను వ్యవసాయ శాఖ ఆర్బీకేల ద్వారా అందజేస్తోంది. తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతోనే మంచి ఆదాయం పొందే అవకాశాలున్నాయి.

వాడవాడలా రామనామం



మాకవరపాలెం: ఊరేగింపులో పాల్గొన్న చిన్నారులు, భక్తులు



నాతవరం: వెన్నలపాలెంలో ఆలయాల శుద్ధికి విచ్చేసిన మహిళా భజన బృందం



రావికమతం: దొండపూడిలో శ్రీరాముని జెండాలను పంపిణీకి సిద్ధం చేస్తున్న యువకులు

మాకవరపాలెం: అయోధ్యలో సోమవారం రాముడి విగ్రహ ప్రతిష్ట నేపథ్యంలో ఆదివారం సాయంత్రం సీతారాముల విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. స్థానిక రామాలయం నుంచి ప్రారంభించిన ఈ ఊరేగింపు అన్ని వీధుల్లోనూ కొనసాగింది. ఈ సందర్భంగా చిన్నారులు సీతారాములతోపాటు లక్ష్మణుడు, ఆంజనేయుడు వేషధారణలో ఆకట్టుకున్నారు. మహిళలు, చిన్నారులు కోలాటాల నడుమ ఊరేగింపు కార్యక్రమం జరిగింది. సోమవారం ఉదయం నుంచి రామాలయంలో ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు కమిటీ తెలిపింది.

నాతవరం: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట నేపథ్యంలో మండల వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు చేసేందుకు శుభ్రం చేసి అలంకరిస్తున్నారు. నాతవరం రామాలయంలో సోమవారం తెల్లవారు నుంచే మహిళలతో భజనలు, కోలాటాల ప్రదర్శనతోపాటు మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నారు. వెన్నలపాలెంలో అంజనేయస్వామి, తలుపులమ్మ తల్లి ఆలయాల పాటు నూతన రామాలయం వద్ద పలు పూజా కార్యక్రమాలు చేసేందుకు మహిళా భజన భక్తులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆకట్టుకున్న ఎడ్ల పరుగు పోటీలు

జిల్లా స్థాయి పోటీ విజేత సింహాద్రిపురం



మాడుగుల: ఎడ్ల పరుగు పోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



బోయిలకింతాడలో ఉరకలేస్తున్న ఎడ్లు

దేవరాపల్లి: బోయిలకింతాడలో మరిడిమాంబ తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా ఎడ్ల బళ్ల పరుగు పోటీలు హోరాహోరీగా సాగాయి. వీటిని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, సర్పంచ్ బూరె బాబూరావు, గ్రామపెద్దలతో కలిసి ప్రారంభించారు. ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా పది ఎడ్ల బళ్లు పాల్గొన్నాయి. చోడవరం మండలం సింహాద్రిపురానికి చెందిన అభయాంజనేయ స్వామి ఎడ్లు విజేతగా నిలిచాయి. హర్షవర్ధన్‌నాయుడు(దండిసురవరం) ద్వితీయ, సంపత్‌వినాయక(సర్పాపురం) తృతీయ, నాల్గు, ఐదు, ఆరో స్థానాల్లో మజ్జి రాజేష్, అద్దేపల్లి అనిల్‌కుమార్, శ్రీకృష్ణ పరమాత్మ(చుక్కపల్లి) ఎడ్లు నిలిచాయి. ఏడో స్థానంలో అద్దెపల్లి పాలవెల్లి(చుక్కపల్లి), 8వ స్థానంలో సిద్ధి వినాయక(లక్కవరం), 9వ స్థానంలో శ్యామ్‌కుమార్(లక్ష్మీపురం) ఎడ్లు నిలిచాయి. వీరికి వరుసగా రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.9 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1,500, రూ.వెయ్యి చొప్పున బహుమతులను సర్పంచ్ బాబురావు, గ్రామ పెద్దలు దాసరి వెంకునాయుడు, అన్నం రామునాయుడు, కొమర బాబూరావు, అన్నం రాము, అన్నం వెంకటరావు, బొబ్బిలి రాము, తుంపాల నాయుడు అందజేశారు.

నేడు చౌడువాడలో ఎడ్లబళ్ల పోటీలు

కె.కోటపాడు: చౌడువాడ మేజర్ పంచాయతీ గవరపేటలో సోమవారం సీతారాముల తీర్థం నిర్వహించనున్నారు. ఈ మేరకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందేలు నిర్వహించనున్నారు. మొదటి 14 స్థానాల్లో నిలిచిన ఎడ్లబళ్లకు నగదు పురస్కారాన్ని అందించనున్నారు. పాల్గొనే ఎడ్లబళ్ల యజమానులు ఇతర వివరాలకు 9966485764 సంప్రదించాలని కమిటీ సభ్యులు కోరారు.

మాడుగుల: సత్యవరంలో ఆదివారం అత్యంత వైభవంగా మరిడిమాంబ తీర్థం జరిగింది. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందెం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ పోటీలు తిలకించడానికి గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల వారు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 10 ఎడ్ల బళ్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఆరు జతలకు బహుమతులను కమిటీ సభ్యులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తలారి అప్పారావు, సర్పంచ్ జెర్రిపోతుల నాగమణిరామారావు, ఉప సర్పంచ్ ఒమ్మలి పెంటయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు గోకేడ అప్పలనాయుడు, యలమంచిల రమణ, శనివాడ వెంకటరమణ పాల్గొన్నారు.



కె.కోటపాడు: అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా రావాలమ్మ తీర్థం

కె.కోటపాడు: మండలంలో కె.కోటపాడు, కింతాడ గ్రామాల ఆరాధ్యదేవత రావాలమ్మ తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిమాన్వితమైన అమ్మవారిగా గుర్తింపు పొందిన రావాలమ్మకు రెండు గ్రామాల ప్రజలు పూజలు చేశారు. తీర్థం సందర్భంగా గ్రామంలో సందడి కోలాహలం నెలకొంది. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు నేడు

దేవరాపల్లి: కొత్తపెంట పైడిమాంబ తీర్థ మహోత్సవ గోడ పత్రికను ఆదివారం తారువ క్యాంప్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన్ను కొత్తపెంట సర్పంచ్ రొంగలి వెంకటరావు, గ్రామ పెద్దలు తీర్థానికి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ తీర్థ మహోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పోటీలు నిర్వహించి, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ. 2వేలు, రూ.వెయ్యి చొప్పున బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ సర్పంచ్ రొంగలి శంకరరావు, చిరికి శంకరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ కేవీ రమణ పాల్గొన్నారు.

రేపు ఒమ్మలిలో మోదకొండమ్మ తీర్థం

మాడుగుల: ఒమ్మలిలో ఈ నెల 23న మోదకొండమ్మ తీర్థం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ ఉగ్గిన వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా తప్పెటగుళ్లు, నేల వేషాలుతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

సమష్టిగా ఉంటేనే సమస్యల పరిష్కారం

మాకవరపాలెం: పెన్షన్‌దారులంతా సమష్టిగా ఉన్ననాడే సమస్యలను పరిష్కరించుకోవచ్చని ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం మండలాధ్యక్షుడు కోసూరు రామారావు తెలిపారు. తామరంలో ఆదివారం పెన్షన్‌దారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్‌దారుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. అనంతరం పెన్షన్‌దారుల నుంచి ట్రెజరీ అధికారులు వేలిముద్రల ద్వారా జీవన ధ్రువీకరణ పత్రాలను సేకరించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి రంగరాజు, రామరక్షణ సంఘ చైర్మన్ వానపల్లి నూకరాజు, సభ్యులు వెంకటరాజు, అచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.